క్లుప్తంగా

పేద విద్యార్థికి ఆర్థిక సాయం


విద్యార్థికి నగదు అందిస్తున్న క్లబ్ సభ్యులు

వేటపాలెం: కొత్తపేట పంచాయతీ ప్రసాద్‌నగర్ దొంబెరా బాలికల వసతి గృహంలో ఉంటున్న పేద విద్యార్థికి చీరాల రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రూ. 20 వేలు ఆర్థిక సహకారాన్ని బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు మామిడాల శ్రీనివాసరావు మాట్లాడుతూ చీరాల ఇంజినీరింగ్ కళాశాల్లో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న పేద విద్యార్థిని కాటం జ్యోతికి ఫీజు నిమిత్తం రోటరీ సభ్యుడు బండారుపల్లి హేమంత్ కుమార్ రూ.20 వేలు ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో చీరాల కృష్ణమూర్తి, పోలుదాసు రామకృష్ణ, డివి సురేష్, జివై ప్రసాద్, తిరుమలశెట్టి లక్ష్మి, ప్రతాప్, బాబూరావు, మల్లేశ్వరి పాల్గొన్నారు.

సప్తతి ఉత్సవ కరపత్రం ఆవిష్కరణ


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సృజన సభ్యులు

అద్దంకి రూరల్: సృజన 27వ వార్షికోత్సవం సందర్భంగా వీరవల్లి సుబ్బారావు (రుద్రయ్య) సప్తతి ఉత్సవ కరపత్రాన్ని బుధవారం స్థానిక చిన్ని శాంతమ్మ పిచ్చయ్య సేవాసదన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కవిసమ్మేళనం, సాహిత్య కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సృజన అధ్యక్షుడు గాడేపల్లి దివాకరదత్తు, కె అనిల కుమారసూరి, మహమ్మద్ రఫీ, పాలపర్తి జ్యోతిష్మతి, దేవపాలన, పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి, ఇలపావులూరి శేషతల్పశాయి, అద్దంకి లేవీ ప్రసాద్, మాలాది శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జీవాల పెంపకంలో జాగ్రత్తలు అవసరం

చీరాల టౌన్: పాడి పశువుల పెంపకంలో, జీవాల ఆరోగ్యం పట్ల పశుపోషకులు జాగ్రత్తగా ఉండటం వలన జీవాలకు సీజనల్ వ్యాధులు దరిచేరవని ఈపురుపాలెం పశువైద్యురాలు పావని అన్నారు. బుధవారం మండలంలోని బోయినవారిపాలెం గ్రామంలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి 39 గేదెలకు గర్భకోశ చికిత్సలు, 19 గొర్రెలు, 18 దూడలకు, 25 పశువులకు పరీక్షలు నిర్వహించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

జే.పంగులూరు: గుర్తు తెలియని వాహనం ఢీకొని తండ్రి మృతి చెందగా, కొడుకుకి గాయాలయ్యాయి. ఈఘటన మండల పరిధిలోని ముప్పవం రోడ్డులోని జనకవరం రోడ్డు సమీపంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. బంధువుల వివరాల మేరకు కోటపాడు గ్రామానికి చెందిన తమ్మిశెట్టి ఏడుకొండలు (45), కొడుకు నాగార్జున ఇద్దరు గ్రామం నుంచి మందుల కోసం మోపెడ్‌పై పంగులూరు బయలుదేరారు. కొటపాడు వైపు నుంచి వచ్చి ముప్పవరం రోడ్డుమీదగా పంగులూరు వైపు వెళుతున్నారు. జనకవరం రోడ్డు దాటిన కొంతదూరం వెళ్లిన తరువాత గుర్తు తెలియని వాహనం ఎదురుగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో తండ్రి ఏడుకొండలు తలకు తీవ్రగాయమై అక్కడిక్కడే మృతి చెందాడు. క్షతగాత్రుడు నాగార్జునను 108 సహాయంతో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎస్సై తిరుపతిరావు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశాడు.


ఇదుపులుపాడులో ప్రకాశం జయంతి వేడుకలు నిర్వహిస్తున్న ఎంఈవో, విద్యార్థులు


చినగంజాంలో ప్రకాశం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ, ఉద్యోగులు


అద్దంకిలో ప్రకాశం పంతులుకు నివాళి అర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ప్రకాశం పంతులు సేవలు స్ఫూర్తిదాయకం

- ఘనంగా టంగుటూరి జయంతి వేడుకలు
- నివాళులర్పించిన నాయకులు, ప్రజాసంఘాలు

చీరాల టౌన్/వేటపాలెం: నిజాయితీ, నిరాడంబర రాజకీయాలకు ప్రతిరూపంగా నిలిచిన స్వాతంత్ర్య సమర యోధుడు, ఆంధ్రరాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు చేసిన సేవలు భావితరాలకు ఆదర్శమని తహశీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు అన్నారు. టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని పురస్కరించుకుని బుధవారం తహశీల్దార్ కార్యాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రకాశం పంతులు చిత్రపటానికి మండల అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. యువత ప్రకాశం పంతులును ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ సురేష్, రీసర్వే డీటీ అర్జున్, ఆర్ఐ సీహెచ్.శేఖర్, వీఆర్వోలు, వీఆర్ఏలు ఉన్నారు. అలానే ఉపఖజానా కార్యాలయంలో ఎస్టీవో భాగ్యలక్ష్మీ, ఉద్యోగులు టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ మధిర, ఉద్యోగులు ఉన్నారు.

■ దేశాయిపేట శాఖాగ్రంథాలయంలో టంగుటూరి జయంతి వేడుకల సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎం శ్రీనివాసరావు, కరుణమ్మ, చైతన్య, కిషోర్, శివయ్య, మస్తాన్, జగదీష్, లైబ్రేరియన్ డి ధనమ్మ పాల్గొన్నారు.

ఆంధ్రకేసరి అంటేనే ప్రకాశం పంతులు..

కారంచేడు/మార్టూరు/చినగంజాం: స్వాతంత్ర్య సమరయోధుడు, బ్రిటిష్ పోలీసుల తుపాకులకు గుండె చూపిన ధీరుడు, ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశంపంతులు 152వ జయంతి వేడుకలను యద్దనపూడి తహశీల్దారు కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు వెంకటరెడ్డి, డీటీ మస్తాన్‌రావు టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ విష్ణు, సీనియర్ అసిస్టెంట్ భాస్కర్‌రావు, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

■ చినగంజాం మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కే స్వరూపరాణి ఆధ్వర్యంలో ప్రకాశం పంతులు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎంఈఓ పీఆర్ ఎఈ దాసు, ఏపీఎం అంజిబాబు, ఏపీఓ లక్ష్మీదేవి, సచివాలయ ఉద్యోగ సంఘాల రాష్ట్ర గౌరవాధ్యక్షుడు జీవీవీ రాఘవరెడ్డి, మండల సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం డీ రత్నకుమారి, మున్నంవారిపాలెం ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం మల్లారెడ్డి ఆధ్వర్యంలో టంగుటూరి చిత్రపటానికి నివాళులర్పించారు.

■ ఇంకొల్లు మండలం ఇడుపులపాడు విద్యాపరిషత్ ఉన్నత పాఠశాలలో టంగుటూరి జయంతి వేడుకలకు పాఠశాల హెచ్ఎం పిడవర్తి పేరిరెడ్డి అధ్యక్షత వహించగా మండల విద్యాశాఖాధికారి పీవీ రాఘవరావు ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

■ స్వాతంత్ర్యం తీసుకురావడంతో ప్రాణాలను సైతం పణంగా పెట్టిన ఎంతో మంది త్యాగమూర్తులను స్మరించుకోవడం మన ధర్మమని ఎంఈవో ఎంవీ సత్యన్నారాయణ అన్నారు. కారంచేడు ఎంఆర్‌సీలో ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు ప్రసాద్, పుష్పలత, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అద్దంకి: మండలంలోని వివిధ పాఠశాలలు, గ్రంథాలయాలు, కార్యాలయాల్లో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని బుధవారం ఘంగా నిర్వహించారు. మైలవరం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం ఎస్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన చూపిన బాటలో పిల్లలంతా నడవాలని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

■ సంతమాగులూరు శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ భాస్కరరెడ్డి ప్రకాశం పంతులు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

అద్దంకి రూరల్: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 152 వ జయంతి వేడుకలను బుధవారం ప్రకాశం మిత్రమండలి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా బంగ్లారోడ్‌లోని ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ప్రకాశం పంతులుగారి మునిమనవరాలు సుభాషిణి, వీరవల్లి సుబ్బారావు (రుద్రయ్య), గాడేపల్లి దివాకరదత్తు, ఇలపావులూరి శేషతల్పశాయి, పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి, షేక్ మహమ్మద్ రఫీ, ఉటుకూరి రామకోటేశ్వరరావు, తమ్మన శ్రీనివాసరావు, చిన్ని మురళీ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రకాశం మిత్రమండలి సభ్యులు


నందిగుంటపాలెంలో ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు


యద్దనపూడిలో టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న అధికారులు


చీరాల: టంగుటూరికి నివాళులర్పిస్తున్న తహశీల్దార్ ప్రభాకర్‌రావు, ఉద్యోగులు


దేశాయిపేటలో ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న అధికారులు


పేరాలలో ల్యాండింగ్ ప్రక్రియను వివరిస్తున్న ఉపాధ్యాయులు


కారంచేడులో చంద్రయాన్-3 లైవ్


అద్దంకి జెడ్పీహెచ్ఎస్‌లో చంద్రయాన్-3 లైవ్ చూస్తున్న విద్యార్థులు

జాబిల్లిని ముద్దాడిన చంద్రయాన్-3

- పాఠశాలల్లో ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించిన విద్యార్థులు
- ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందల వెల్లువ

చీరాల అర్బన్: ప్రపంచం మొత్తం ఆగస్టు 23వ తేదీని గుర్తుంచుకుంటుంది. అంతరిక్ష రంగంలో తమకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదిచుకుంది మన దేశం. శాస్త్రవేత్తల కృషితో ఉత్కంఠగా ఎదురుగా చూస్తున్న చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం అయింది. జాబిల్లిపై ఇప్పటివరకు ఏ దేశం దిగని దక్షిణ ధ్రువంపై విక్రమ్ ల్యాండర్ కాలుమోపి జాబిల్లిని ముద్దాడింది. సాయంత్రం 5.44 నిమిషాలకు ల్యాండింగ్ ప్రక్రియ మొదలవగా 6.04 నిమిషాలకు విక్రమ్ ల్యాండర్ సురక్షితంగా జాబిల్లిపై కాలు మోపింది. చంద్రయాన్-3 ప్రత్యక్ష ప్రసారాన్ని అందరూ ఆసక్తిగా టీవీలలో తిలకించారు. అలానే పేరాలలోని ఆంధ్రరత్న మున్సిపల్ హైస్కూల్‌లో ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు.

కారంచేడు: చంద్రయాన్-3 విజయం సాదించడంతో విద్యార్థులు కేరింతలు కొట్టారు. విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని తిమిడెదపాడు ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు జీ రమేష్‌రెడ్డి సహకారంతో విద్యార్థులు చంద్రయాన్ ల్యాండింగ్ తీరును వీక్షించారు. మండల కేంద్రం కారంచేడులోను గృహాల్లోను ప్రజలు టీవీల వద్ద చేరి ల్యాండింగ్‌ను వీక్షించారు. అద్దంకిలోని జెడ్పీహెచ్ఎస్ గరల్స్ స్కూల్‌లో చంద్రయాన్ ల్యాండింగ్‌ను లైవ్‌లో వీక్షించారు.

చీరాల రూరల్: బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక గడియార స్థంభం సెంటర్లో చంద్రయాన్-3 విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున బాణా సంచాలుకాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. జిల్లా అధ్యక్షుడు మువ్వల వెంకట రమణారావు, రాష్ట్ర నాయకుడు సీనియర్ న్యాయవాది బండారుపల్లి హేమంత్ కుమార్‌లు మాట్లాడారు. అద్దంకి మండలంలోని నాగులపాడు పాఠశాలలో ఎంఈవో సుధాకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టీవీలలో బుధవారం సాయంత్రం చంద్రయాన్‌ను విద్యార్థులు ఆసక్తిగా వీక్షించారు.


చీరాల గడియార స్తంభం సెంటర్లో సంబరాలు చేస్తున్న బీజేపీ నాయకులు


పేరాలలో జాతీయ జెండాను రెపరెపలాడిస్తున్న విద్యార్థులు


వేటపాలెం: కొత్తపేటలో లైవ్ చూస్తున్న విద్యార్థులు


తిమిడెదపాడులో ల్యాండింగ్‌ను చూస్తున్న విద్యార్థులు

ముగిసిన ఈర్లగంగమ్మ కొలుపులు

బల్లికురవ: మండలంలోని నక్కబొక్కలపాడు గ్రామంలో గోరంట్ల వారి దేవర ఈర్లగంగమ్మ కొలుపులు, ప్రతిష్ట మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. గ్రామ కూడలిలో సుమారు రూ. 20 లక్షలతో ఆలయాన్ని నిర్మించారు. ప్రతిష్టలో భాగంగా సోమవారం చీరాల సముద్రస్నానానకి వెళ్లారు. మంగళవారం గ్రామోత్సవం మాతుడుపు, కార్యక్రమాలను చేపట్టారు. బుధవారం ఆలయంలో గంగమ్మతల్లి విగ్రహాన్ని ప్రతిష్టించారు. కొలుపులు, ప్రతిష్ట మహోత్సవంలో భాగంగా మూడు రోజులుగా గ్రామంలో బంధుమిత్రుల రాకతో ప్రతి ఇంటా పండగ వాతావరణ నెలకొంది. వేడుకల ముగింపులో భాగంగా రాత్రి ఆలయం వద్ద అన్నదానం చేపట్టారు. వివిధ ప్రాంతాల్లో ఉన్న కుటుంబ సభ్యులంతా వేడుకల్లో పాల్గొని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు.

సచివాలయ సంఘం కమిటీ ఎన్నిక

బల్లికురవ: జిల్లా గ్రామ, వార్డు సచివాలయ సంఘాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సచివాలయ సంఘ అధ్యక్షుడిగా ముక్తేశ్వరం సచివాలయంలో పనిచేస్తున్న ఆర్ చినగోవింద నాయక్, ఉపాధ్యక్షుడు కొప్పరపాలెం సచివాలయంలో పనిచేస్తున్న వీరయ్య, సెక్రటరీగా కొమ్మినేనివారిపాలెం సచివాలయంలో పనిచేస్తున్న పవన్, ఎస్ రాజ్యలక్ష్మీ, ట్రెజరర్‌గా, కొత్తూరు సచివాలయంలో పనిచేస్తున్న జబీ. శ్రీదేవి మరో నలుగురు ఈసీ నంబర్లుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రామయ్య, సచివాలయ సంఘ చీరాల డివిజన్ ఉపాధ్యక్షుడు టీ.వజ్రయ్య, పంచాయతీ ఏఈ జీ. హనుమంతరావు పాల్గొన్నారు.

మళ్లీ వైఎస్సార్ సీపీకే పట్టం

- రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య


సంక్షేమ పథకాల లబ్ధి బుక్‌లెట్ అందజేస్తున్న చైతన్య

సంతమాగులూరు (అద్దంకి): రాష్ట్ర ప్రజలు మళ్లీ వైఎస్సార్ సీపీకే పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. ఆయన మండలంలోని మక్కెనవారిపాలెం గ్రామంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నాయకులు, కార్యకర్తలు ప్రజా ప్రతినిధులతో కలసి నిర్వహించారు. దీనిలో భాగంగా ఆయన ప్రతి గడపకు వెళ్లి కుటుంబంలోని వారిని పలకరించి, వారికి ప్రభుత్వం ద్వారా చేకూరిన లబ్ధిని తెలిపే పత్రాలను అందజేశారు. ప్రభుత్వం ఎలా ఉంది.. పథకాలు అందుతాయన్నాయా, వలంటీర్లు సేవలు ఎలా అందిస్తున్నారని అడిగి వారు చెప్పిన సమాధాలతో సంతృప్తి చెందారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అడవి శ్రీనివాసరావు, మండల నాయకులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వలంటర్లు సచివాలయ ఉద్యోగులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి

చీరాల టౌన్: వైఎస్సార్ కేపీ ద్వారా రుణాలు తీసుకున్న పొదుపు గ్రూపులు రుణాల చెల్లింపులు సకాలంలో చెల్లించేలా వీఓఏలు చర్యలు తీసుకోవాలని ఏపీఎం సుబ్బారావు సూచించారు. బుధవారం బుర్లవారిపాలెంలోని స్త్రీశక్తి భవన్‌లో మండలంలోని వీఓఏలకు ఒకరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ మండలంలో ఉన్న పొదుపు గ్రూపుల వద్దకు వీఓఏలు నెలకు ఒకసారి సమావేశాన్ని నిర్వహించి గ్రూపుల ప్రగతిని తెలుసుకోవాలన్నారు

సమస్యలు పరిష్కరంచాలని ఎమ్మెల్యేకు వినతి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న వీఓఏలు

చీరాల: చీరాల, వేటపాలెం మండలాల పరిధిలోని డ్వాక్రా సంఘాల వీఓఏలు రోజువారీ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తికి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌కు వినతిపత్రం అందించారు. తమ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కార దిశగా కృషి చేయాలని ఆయనను కోరారు. కార్యక్రమంలో చీరాల, వేటపాలెం మండలాల వీఓఏలు పాల్గొన్నారు.

మత్స్యకారులందరూ ఐకమత్యంతో ఉండాలి

చీరాల: మత్స్యకారులందరూ ఐకమత్యంతో కలిసిమెలిసి ఉండాలని వైఎస్సార్ సీపీ చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ అన్నారు. బుధవారం వేటపాలెం మండలం కఠారివారిపాలెం గ్రామ కాపులు, పెద్దలు గ్రామంలోని పలు సమస్యలపై వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. తీర ప్రాంతాల్లోని మత్స్యకారులందరూ ఐకమత్యంతో కలిసి ఉండాలన్నారు. కార్యక్రమంలో మొదటి కాపు కటారి బిట్ట, రెండో కాపు కటారి సోమయ్య, మూడో కాపు కొండూరి జాలయ్య, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


గ్రామపెద్దలతో మాట్లాడుతున్న వెంకటేష్

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు


మెరిట్ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకమందిస్తున్న దాతలు

చినగంజాం: చినగంజాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2022-23 విద్యాసంవత్సరంలో మెరిట్ మార్కులు సాధించిన విద్యార్థులకు దాతలు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. 10 వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు, ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు దాతలు, ఉపాధ్యాయులు నగదు బహుమతులను అందజేశారు. పదిలో అత్యధిక మార్కులు సాధించిన బక్కా హేమంత్‌రెడ్డికి పర్వతరెడ్డి లక్ష్మయ్య జ్ఞాపకార్థం పర్వతరెడ్డి నరేంద్రనాథ్ రూ 10 వేలు, ఇంగ్లిషు మీడియంలో ప్రథమ స్థానం సాధించిన హేమంత్ రెడ్డికి రూ 5 వేలు, తెలుగు మీడియంలో ప్రథమస్థానం సాధించిన వాటుపల్లి లిఖితకు రూ 2 వేలు నగదు రిటైర్డ్ సాంఘీక శాస్త్ర ఉపాధ్యాయిని విమలకుమారి అందజేశారు, గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు నాసిక సూర్యనారాయణ ఒక్కొక్కరికి రూ 7500 నగదు అందజేశారు. పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.500, రూ.300 చొప్పున అమెరికాలో ఉంటున్న వలివేటి శ్రీహరి బాబు తరపున వలివేటి అప్పారావు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం డీ రత్నకుమారితో పాటు దాతలు, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

బాలలను వెట్టిచాకిరి చేయిస్తే కఠిన చర్యలు

చీరాల రూరల్: బాలలను పనిలో పెట్టుకుని వారితో నిర్బంధంగా వెట్టిచాకిరి చేయిస్తే కఠిక చర్యలు తీసుకుని బాల కార్మికుల చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామని అసిస్టెంట్ లేబర్ ఇన్‌స్పెక్టర్ అబ్రహం అన్నారు. కార్మిక శాఖ ఆధ్వర్యంలో బుధవారం బాల కార్మికులు వెట్టిచాకిరీ నిర్మూలనపై చీరాలలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రెవెన్యూ, పోలీసు, లయన్స్, స్వచ్ఛంద సంస్థ షాడోస్‌ల ఆధ్వర్యంలో పట్టణంలోని కొన్ని బ్రిక్స్ యూనిట్ల వద్ద తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ లేబర్ ఇన్‌స్పెక్టర్ అబ్రహాం మాట్లాడుతూ బాలలను పనులలో పెట్టుకుని పనులు చేయించరాదని సూచించారు. షాడోస్ సంస్థ నిర్వాహకులు డాక్టర్ డేవిడ్‌సన్ సాల్మన్ మాట్లాడుతూ బాలలకు నిర్దిష్టమైన వయస్సు రాకుండా పనులు చేయిస్తే వారి ఆరోగ్యం పాడైపోతుందన్నారు. కార్యక్రమంలో భాగ్యలక్ష్మి, జాహిద్, రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.